# పత్తి కొనుగోళ్లు అవగాహనతో చేపట్టాలి

- ఈ యేడాది 5,77,938.32 క్వింటాళ్ల పత్తి వస్తుందని అంచనా
- అన్ని రంగాల్లో అభివృద్ధి కోసమే 'నీతి ఆయోగ్'
- భూగర్భ జలాల వినియోగం సక్రమంగా జరుగాలి
- ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ శశాంక సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, సెప్టెంబరు 30 : పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని కలెక్టర్ కే శశాంక అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీవోసీలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా మార్కెటింగ్‌శాఖ ద్వారా చేపట్టే పత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్స్ వ్యాపారులు, సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో మూడు వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయని, కేసముద్రం మార్కెట్ పరిధిలో మూడు జిన్నింగ్ మిల్స్, తొర్రూరులో 2, మహబూబాబాద్‌లో ఒకటిఉండగా జిల్లా మొత్తం ఆరు జిన్నింగ్ మిల్లులున్నాయని తెలిపారు. 2022-23లో పత్తిని ప్రైవేట్ ద్వారా 2,31,165 క్వింటాళ్లు రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2023-24కు 82,580 ఎకరాల్లో పండిన పత్తి 5,77,938.32 క్వింటాళ్లు వస్తుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. పంటలను విక్రయించే రైతులు తమ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకుని ఉండాలన్నారు. 95శాతం రైతులు జిల్లాలో బ్యాంక్ ఖాతాలకు అనుసంధానం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుశాతం మాత్రమే మిగిలి ఉన్నారని, వారు తప్పసరిగా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పత్తి కొనుగోళ్ల వివరాలను బ్యానర్ల ద్వారా రైతు వేదికల ద్వారా పత్తిని పండిస్తున్న గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేయాలన్నారు. సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్ల కేంద్రాల్లో ఐర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి వెంకట్‌రెడ్డి, జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు, అధికారులు పాల్గొన్నారు.

### అభివృద్ధి కోసమే 'నీతి ఆయోగ్'..

దేశంలోని అభివృద్ధికి నోచుకోలేని వెనుకబడిన ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకే కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్ ద్వారా చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే జిల్లాలోని గంగారం మండలాన్ని ఎంపిక చేసినట్లు కలెక్టర్ కే శశాంక తెలిపారు. శనివారం ఐడీవోసీలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి నీతి అయోగ్ కింద దేశంలోని వివిధ ప్రాంతాల్లో పరిస్థితులను ఆయా రాష్ట్రాల ప్రతినిధులతో అడిగి తెలుసుకున్నారు. నీతి అయోగ్ ద్వారా ఏ విధంగా అభివృద్ధి చేపట్టవచ్చునో వివరించారు. అనంతరం అధికారులతో జిల్లాలోని గంగారం మండలంలో పలు అభివృద్ధి పథకాల పని తీరును ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమం కార్యకలాపాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలపై ప్రధాన దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయం, నీటిపారుదల, విద్యుత్, రవాణా కమ్యూనికేషన్ రంగాల మెరుగుదలకు కావాల్సిన సౌకర్యాలు రహదారుల నిర్మాణం, మార్కెటింగ్ సౌకర్యాలు, ఉపాధి కల్పనకు యువత నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు శిక్షణా తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్డీవో సన్యాసయ్య, సీపీవో సుబ్బారావు, ఉద్యానవనశాఖ అధికారి సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల వినియోగం సక్రమంగా జరగాలి..

భూగర్భ జలాల వినియోగం సక్రమంగా జరగాలని కలెక్టర్ కే శశాంక అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో భూగర్భ జలాల వినియోగం, విస్తరణ అవకాశాల కార్యకలాపాలపై భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలను వినియోగించడంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు పరచాలన్నారు. మహబూబాబాద్ జిల్లా జలవనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతమని, మూడు నదులు ప్రవహించడం వాటిపై చెక్‌డ్యాములు నిర్మించడంతో తద్వారా భూగర్భ జలాలు నాలుగు శాతం పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్‌కాకతీయ పథకం చెరువులను పటిష్టపరచడంతో భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదపడ్డాయన్నారు. గ్రామాల్లో ఎంపీడీవోల ద్వారా మ్యాజిక్ సోక్‌పిట్, కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు ఇంకి భూగర్భ జలాలు పెరగడానికి మరో కారణమన్నారు. నీటి వినియోగం ఎక్కువగా ఉన్నచోట డిజిటల్ మీటర్లు పెట్టించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, భూగర్భ జల వనరులశాఖ అధికారి సురేశ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సామూహిక అక్షరాభ్యాసంలో సీడీపీవో దెబోరా

## 'అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం'

బయ్యారం సెప్టెంబర్ 30 : అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం లభిస్తుందని సీడీపీవో దెబోరా తెలిపారు. శనివారం మండలంలోని ఉప్పలపాడు, బయ్యారం అంగన్‌వాడీ సెంటర్‌లో పోషక మాసోత్సవాల సందర్భంగా సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియెగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, టీచర్లు విజయలలిత, పద్మ, సునీత, కమల, స్వప్న, లలిత తదితరులు పాల్గొన్నారు.


మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

## ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్న బీజేపీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 30 : దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తుందని పీవైఎల్ రాష్ట్ర నాయకులు పైండ్ల యాకయ్య అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నెల 12, 13న జరిగే పీవైఎల్ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ నిరుద్యోగులకు కేవలం మాటలను మాత్రమే చెబుతూ కాలయాపన చేసున్నారని తెలిపారు. నిరుద్యోగులకు ఉపయోగపడే అనేక సంస్థలను మూసి వేశారని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ ఈ మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, సూర్యం, రంగయ్య, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహిళా సంఘాల డబ్బులను రికవరీ చేయాలి

- పీడీ సన్యాసయ్య
- సీసీకి షోకాజ్ నోటీసులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 30 : మండల పరిధిలోని దర్గాతండా గ్రామ పంచాయతీ పరిధిలో మహిళా పొదుపు సంఘాల డబ్బులను బ్యాంకులో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్న వీవోఏలు వెంటనే రికవరీ చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ సన్యాసయ్య శనివారం ఆదేశించారు. దర్గాతండాలోని వీవోఏ రాధిక పరిధిలోని ఐదు మహిళా సంఘాల రూ.11,25,925లు, శైలజ పరిధిలోని ఆరు సంఘాల రూ.9,65,102ల పొదుపు డబ్బులను బ్యాంకులో జమ చేయలేదని తనిఖీలో నిరూపణ అయినట్లు తెలిపారు. ఇద్దరు వీవోఏలు రికవరీ చేయాలని ఆదేశించారు. జీపీ పరిధిలో సీసీ నాగిరెడ్డికి షోకాజ్ నోటీస్‌ను ఇచ్చినట్లు తెలిపారు.


చెరువులో చేప పిల్లలను వదులుతున్న సర్పంచ్ భాస్కర్‌రావు, సోమయ్య

## 'మత్స్యకారుల సంక్షేమాభివృద్ధికి పెద్దపీట'

పెద్దవంగర, సెప్టెంబర్ 30 : మత్స్యకారుల సంక్షేమాభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సర్పంచ్ చింతల భాస్కర్‌రావు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. శనివారం గంట్లకుంట పెద్దచెరువులో సర్పంచ్ భాస్కర్‌రావు, చిట్యాలలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య స్థానిక మత్స్య సొసైటీ నాయకులతో కలిసి చేప పిల్లలను చెరువుల్లో వదిలారు. అనంతరం వారు మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఉచిత చేపపిల్లలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి మత్స్యకారుడికి సొసైటీలో సభ్యత్వం ఇచ్చేలా ప్రత్యేక డ్రైవ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా నిధులను సైతం అందించడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజు, మత్స్య సొసైటీ నాయకులు సోమయ్య, యాకయ్య, సాయిలు, ఉపేందర్, నాగరాజు, శ్రీధర్, వెంకన్న, రాములు, శ్రీనివాస్, అంజయ్య, సంపత్, నాగయ్య, జగదీశ్ పాల్గొన్నారు.

## అక్టోబర్ 4న మండల సర్వసభ్య సమావేశం

పెద్దవంగర, సెప్టెంబర్ 30 : అక్టోబర్ 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి సకాలంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

## 'అమరుల త్యాగాలు మరువలేనివి'

నెల్లికుదురు, సెప్టెంబర్ 30 : భారత స్వాతంత్ర్యం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనల కోసం అమరులైన వీరుల త్యాగాలు మరువలేనివని బీఆర్‌ఎస్ మండల నాయకుడు యాసం రమేశ్ అన్నారు. తపాలాశాఖ ఆధ్వర్యంలో అమరవీరుల త్యాగాలకు గుర్తు గా 'మేరీ మాటి-మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని నైనాల గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు చిర్ర లింగయ్య, దండంపల్లి వెంకయ్య, చట్ల యాకయ్య, కట్టమల్లుల కుటుంబ సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్తులు చిర్ర శ్రీనివాస్, దండెంపల్లి వెంకటసాయిలు, పెరుమాండ్ల ఉపేందర్, ఏర్పుల ఉపేందర్, బత్తిని అజయ్, రవిదాస్, తపాలాసిబ్బంది సైదులు, బాలకృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.


నైనాలలో ర్యాలీ నిర్వహిస్తున్న తపాలాశాఖ సిబ్బంది

### తపాలాశాఖ ఆధ్వర్యంలో..

చిన్నగూడూరు : విస్సంపల్లిలో తపాలాశాఖ ఆధ్వర్యంలో శనివారం అమర వీరుల త్యాగాలకు గుర్తుగా మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మట్టికా నమన్ వీరోస్ కా వందన్ నినాదంతో అమృత కలశ యాత్ర చేపట్టారు. సహాయ పర్యవేక్షకులు లావుడ్యా సైదానాయక్, గ్రామస్తులు సంకినేని వెంకటేశ్వరరావు, దేవేందర్‌రావు ఉన్నారు.


విస్సంపల్లిలో మేరీ మాటీ-మేరా దేశ్ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

విద్యార్థులు చట్టాలపై అవగాహన

## పెంపొందించుకోవాలి


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై జగదీశ్

తొర్రూరు, సెప్టెంబర్ 30 : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్సై జగదీశ్ తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బాలికల భద్రత-సైబర్ నేరాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు, పరిచయస్తులు, సామాజిక మాధ్యమాల్లో మెసేజ్‌లు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే నిర్భయంగా డయల్ 100కు ఫోన్ చేసి సాయం పొందాలన్నారు. మానవ అక్రమ రవాణా, పిల్లలపై లైంగికదాడులను నివారించాలని తెలిపారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడమే పోలీస్ శాఖ లక్ష్యమన్నారు. 18ఏళ్లలోపు బాలబాలికలకు చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. 18ఏళ్ల లోపు బాలికలకు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. చదువుకునే వయసులో సోషల్ మీడియా, సెల్ ఫోనుకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, స్టేటస్‌లో పెట్టుకోవద్దని, వాటిని సైబర్ నేరగాళ్లు మార్ఫింగ్ చేసి వేధింపులకు గురి చేసే అవకాశం ఉంటుందన్నారు. మార్కులు ప్రతిభకు కొలమానం కాదని, నైపుణ్యాలు పెంపొందించుకోవడం అవసరమన్నారు. కానిస్టేబుళ్లు సాయికిరణ్, హైమ, భజ్జాలాల్, రామచంద్రు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.